

# స్త్రీ సాహసిస్తే

శ్రీ "నిజం"

"ఒరేయ్ వెంకట్రావు! అలాగైతే మా అందఱి కంటెనీవే నయం! నెలకో యేభై రాళ్ళు సంపాదిస్తున్నావు"

"వెధవ ఉద్యోగం లెస్తు; కాంపౌండరీయే కాదు? మీలాగ బి యే లు ప్యాసయ్యామా! ఎమ్మేలు ప్యాసయ్యామా! నామాత్రంచదువుకి ఏదో కాలక్షేపానికి……"

"ఎందుకొచ్చిన ఎమ్మేలు! కొత్తగా ముండామోసినవాళ్ళలాగ వీధులోకిరావడానికే సిగ్గుగా యింట్లో అఘోరిస్తున్నాం"

"ఎప్పటికైనా దానిఫలం రాకుండాఉంటుందేమిటి? ఒక్కసారి గుంజుతావు ఇన్నాళ్ళకీ సరిపడేలాగ"

"ఏమిటి లాగేది వల్లకాదు! దానిమాటకేంగాని-నీకక్కడ అనుకూలంగా ఉందా? ఎక్కడ అన్నావు?"

"చెందమూరు; అక్కడ ఊరిలో అందఱికి మనమంటే చాలా గౌరవమే"

"ఎంత జీతం?"

"పాతికరూపాయలు; పైగా యింకా ఏమన్నా కేసులు చేసుకుంటే ఇంకో పాతికరాళ్ళు కిట్టుతున్నాయి"

"దానికి మీ డాక్టరు అడ్డురాడుగదా"

"మా డాక్టరుగారు మనకేమీ అడ్డురాడు; పైగా నేనంటే ఎంతో నమ్మకం"

"ఐతే చెప్పకు; ఇంట్లో పనులవీ చెప్పి చంపడుగదా"

"అట్టే లేదులే; నేనంటే నమ్మకంకాకుండా భయం కూడాను"

"అదేవిట్రోయ్ అపుడే నీవంటే భయపడేట్లు కూడా చేశావ్"

"దానికి చాలా గాథ ఉందిలే"

"ఏమిటది ? ఇంట్లో వ్యవహారమే యేమిటి ?"

"అదంతా రహస్యం. చెప్పకూడదు"

"నేనుమాత్రం ఇది చాటిస్తానే యేమిటి ? అన్నట్టు మీ డాక్టరు ఎవరు ?"

"శివానందంగారు"

"ఎల్. ఎం. పీయేనా ?"

"కాదు, యింకా ఆ పైడిగ్రీయే"

"పెద్దవాడా ? కుఱ్ఱవాడా?"

"కుఱ్ఱవాడే, ఓ ముప్పైఏయేళ్లుంటాయి, అంతా ఒక్క ఐదేళ్ళయింది డిగ్రీ పుచ్చుకొని; పుచ్చుకోగానే ఇందులో ప్రవేశించారు"

"ఐతే బోర్డుద్యోగమా?"

"ఔను"

"అసలు కథేమిటి? నీకు భయపడవలసిన కారణం ?"

"ఏమీలేదు; ఆయన మెడికల్ కాలేజీలో చదువు తున్నప్పుడే కొద్దిగా చుక్క అలవాటు"

"అలాగా ? అవునోయ్ యిపుడు డాక్టరు పరీక్ష ప్యాసైనవాళ్ళు అందఱికీ యిదొక పెద్దరోగమైపోయింది. వెధవత్రాగుడు"

"మొట్టమొదట; కొద్ది అలవాటు; మితంగా పుచ్చుకునేవాడట. ఇపుడు కొంచెం డబ్బు రావడంతోటే జోరయిపోయింది. నేను ప్రవేశించిన క్రొత్తఱికంలోనే–"

"నీవు వెళ్ళి రెండేండ్లవుతుందా ?"

"రెండేండ్లే; మూడేండ్లుకావచ్చింది; అపుడే ఆయన భార్య కాపురానికివచ్చింది. మా డాక్టరుగారు ఏంజేశారనుకున్నావు ? ఈ త్రాగినతిక్కమీద ఆవిడని పట్టుకొని చావచంపి చెవులుమూసేవాడు"

"చదువుకున్నవాళ్ళకి యిదే పాశ్చాత్యకాలంవస్తే యింకెక్కడ చచ్చేది. చేసుకున్న పెళ్ళాలని ఊరికే చావగొట్టడం ! దీనికితోడు ఏమన్నా పై తిరుగుడుగుణంకూడా ఉందా ఈయనకి ?"

"కొద్దిగా ఉంది; కాని దానిగురించి ఆట్టే ఖర్చుకు ఒప్పుకోడు"

"అలాగ చెప్పు; త్రాగుడు వ్యభిచారం అప్పచెల్లెళ్ళగా"

"తర్వాత యీయన రోజూ తిరిగితిరిగి రాత్రియే పన్నెండుగంటలకు రావడం, అపుడు బాగా బిగించి, మళ్ళీ భార్యను కొట్టుతూఉండడం మామూలయి పోయింది ఆయనకి"

"ఈయనకి ఇంకెవళ్ళూలేరు ఇంట్లో?"

"అంతా ఉన్నారు. తల్లీ దండ్రీ, తమ్ముళ్లు చెల్లెళ్ళు చాలామంది ఉన్నారు. వాళ్ళనందఱినీ వారింటిదగ్గరే అనకాపల్లిలో ఉంచేశారు; ఎపుడైనా తోచినపుడు కొంత పంపుతూఉంటారు ఇంటికి"

"ఎంత దుర్మార్గుడు; తన్ని కనుకున్న తలిదండ్రుల ఋణం తీర్చుకోలేకపోయినతర్వాత వాడిజన్మయెందుకూ? మళ్ళీ చదువుకున్నవాడు. ఆ ముసలివాళ్ళని తనదగ్గరే ఉంచుకొని పోషించి సుఖపెట్టకూడదు"

"వాళ్ళక్కడ నానాపాట్లు పడుతున్నారట పాపం; ఆ ముసలాయన యిప్పటికీ ప్రయివేట్లవీ చెప్పుకొని బ్రతుకుతున్నాడట పాపం"

"అసలు సంగతి వదలేశాం; ఊఁ; భార్యని కొట్టుండేవాడు కొట్టుంటే"

"ఈలాగ సంవత్సరంపాటు ఆవిడ బాధపడింది; దీనికితోడు ఆయన డబ్బంతా తీసుకుపోయి యీయన క్రొత్తగా పరిచయంచేసుకున్న నర్సువచ్చింది—దానికిచ్చే వాడు"

"అక్కడిదే నేమిటి ?"

"కాదు. ప్రక్కనే యింకో రూరల్ డిస్పెన్సరీలోది. దానికి డబ్బంతా యిస్తూ ఉండేవాడు; కొన్నాళ్ళకి

ప్రక్కన ఇంకో ఊళ్ళో లేడీడాక్టరు ప్రోగయింది. అక్కడ నుంచి వందలు వేలు ఆవిడ గుంజేసేది. ఈ సమయంలో నన్ను చంపేవాడు అవి యిమ్మనీ యివి యిమ్మనీని"

"ఏంచేస్తావు ? వాడు చెప్పినట్లల్లా చేయాలి; యెంత నీచపుపనైనా"

"ఒకసారి ఏమయిందనుకున్నావు ? మా డాక్టరు గారు పనుండి అనకాపల్లి వెళ్ళారు; నేనింటిదగ్గఱే ఉన్నాను. ఆ భార్య నన్నన్నీ అడిగింది; ఆవిడకి నే నన్నీ చెప్పేశాను"

"కొంప మునిగింది; ఈయన ఇలాగ తిరగడానికి ఏమన్నా పిల్లలా ?"

"చెప్పటం మరచిపోయాను; ఏటా ఒక్కొక్క పిల్లాడు ఇప్పటికి నలుగురు; ఆయన అంతగా తిరగడానికి యిదొక కారణం కూడాను"

"ఔను. అంతేలే; అలాగ చెప్పితే ఆవిడ ఏమంది పాపం ?"

"విని మాట్లాడ కూరుకుంది; ఎప్పటిలాగ ఆయన ఊరునుంచి రాగానే మళ్లీ నర్సుదగ్గఱకి పోయేడు యింటికన్నా రాకుండాను. వెళ్ళి రెండురోజులదాకా జాడ లేదు. మూడోరోజు సాయంత్రం ౮ గంటలకివచ్చేరు. నేనప్పుడు వారింటిదగ్గఱే ఉన్నాను. ఆవిడ పిల్లలని పడుకోబెట్టి ఇవతలకి వచ్చింది; ఆ వేళే తలంటుకుంది. కాళికాదేవిలాగ కనబడుతుంది. అసలుమనిషే బాగా బారీమనిషి; డాక్టరు గారికంటె చాల పెద్దదిలాగ కనబడుతుంది, ఆ లావూ పొడుగూను. రాగానే ఏంచేసిందనుకున్నావు—"

"ఏచేసిం దేమిటి ?"

"ఇన్నాళ్ళనుంచి యెలాగ సహించి ఊరుకుందో ! ఒక్కసారి గప్‌మంది; ఆయనవచ్చి కోటూ అది విప్పి యివతలకి పంచెగుండారు చుట్టుకొని వచ్చేడు. "ఎక్కడికి వెళ్ళారు ?"అని అడిగింది. "ఎక్కడకో వెళ్లాను నీకెందుకు వెధవవు ఆడముండవు" అని ఆయన గశిరేశాడు.

"నాకుకాకపోతే మఱెంకెవరికి ?"అని యెదురుకుందావిడ.

"ఛీ! నోరుముయ్యి ! పండ్లూడకొట్టేను పాంద్ర వెధవా ! అని ఝుశిపించేడు పెద్ద గొంతుకతో."

"మీరు అలాగ అలాగ తిరిగివస్తూఉండడం; ఉన్న దంతా తగలబెట్టి సంసారం నానా పాడు చేస్తూ ఉంటే ఆడదాని నే నొక్కత్తెను యింతమందిపిల్లలతో యెన్నింటికని యీదుకురానూ ? మాటాడితే నన్ను పాంద్ర వెధవ అని అనేసిపాఱెయ్యడం కొట్టడమూనూ" అని దీనంగా కంట నీరు తెచ్చుకుంది. "పాకీ వెధవవు యీవేళ నన్ను క్రాస్ పరీక్ష చేస్తున్నావా ? లెంపలు వాయించేస్తాను అని మండిపోయేడు. "అబ్బా ! నేను మంచిచెప్పినా కోపమే; ఏమన్నా కోపమే. మాటాడడానికి వల్లకాదు. ఊరికే రెండుమెతుకులు తిని హోటలులాగ మళ్లీపోవడం —ఇల్లంటే అంతపెద్దపులిలాగ కనపడుతుంది కామోసు'"
"ఏమిటా ప్రేలాపన; పళ్లురాల్తాయ్ అలాగే వాగుతూ ఉండు"

"ఎందుకు రాల్తాయి ? ఊరుకుంటూఉంటేసరి బొత్తిగా ఆగడం అయిపోయింది"

"వెంటనే ఆయన 'ఛీ పాడుముండా ! యిందాకటి నుంచి వెధవసాధింపు' అని జుట్టుపట్టుకొని రెండుగుద్దులు గుద్దేరు. వెంటనే ఎదురుకొని మళ్లా ఆ జూలుపట్టుకొని వంచీ హాలులోకి లాక్కొచ్చి, యీ దౌడా ఆ దౌడా వాయించేసింది పడపడాను. ఆయన కుఱుచయేమో బాగా చేతికిదొరికాడు; చెడకొట్టేసింది. నే నింతసేపు అరుగుమీద ఉన్నవాడిని లోపలికివచ్చేను. నన్నుచూసి మఱి కొట్టింది. నేను నిలువునా నీరైపోయాను"

"నువ్వేమిచెయ్యలేదు"

"ఏంచెయ్యడానికి ఏంతోచలేదు. అలాగ నిలబడి పోయేను. నన్నుచూసి మఱింత సిగ్గుపడిపోయేడు మా డాక్టరుగారు" ఇంకక్కడనుంచి దులిపేసి వదలిపెట్టింది. "సిగ్గువచ్చిందా ? యిల్లు వదలిపెట్టి యెగిరింతాలా ! మాటాడితే త్రాగుడూ ! అడ్డమైన ముండలితోటి అవకతవక పనులా ! చేసుకున్నా పెళ్ళాం తక్కువై పోయిందా ? అంటూ నానామాట్లూ అనేసింది.

"ఆయన యేమన్నాడు?"

"ఏమంటాడా? ప్రక్కన పేనైపోయేడు. మళ్ళా మాటలేదు. అన్నవన్నీ పడ్డాడు. తప్పుని ఒప్పించింది ఆయనచేత. అప్పటినుంచీ పెళ్లామంటే గడగడలు. ఎదురు మాట చెప్పడు. తెచ్చిందల్లా ఏరోజుకారోజు జమాఖర్చు జెప్పాలి. ఎప్పుడైనా ఎక్కడకైనా వెళ్ళినా ఏరోజుకారోజు సాయంత్రానికి హాజరుకావాలి"

"అయితే వ్యాపారం యెదురుతిరిగిందన్నమాట"

"అప్పటినుంచీ ఆవిడకి హడలు. ఒకవేళ యెక్కడికైనా వెళ్ళితే యే పేషంట్లు దగ్గఱకో వెళ్లానంటూ ఉంటాడు. అపుడు నేను సాక్ష్యంపలకాలి"

"నువ్వంటే ఆవిడకి నమ్మకమన్నమాట"

"నమ్మకమే. నేనుచెప్పినదల్లా నమ్ముతుంది. అందుకని నేనంటేకూడ మా డాక్టరుగారికి భయం"

"బాగుంది; మంచి ఘరానా సంపాదించేవు—చూశావూ? ఆడది పడి ఊరుకున్నంసేపే. సాహసిస్త్రీ యెంతపనైనా చేసి తీరుతుంది"

"ఔను. అడుది సాహసించేవరకే"


జన్మ నిగ్రహము

జన్మ నిగ్రహము అవసరమని కొందరు అనవసరమని కొందరు ధనవంతులు వాదోపవాదములు సాగించుచున్నారు. లెక్కలేనన్ని పిల్లలు గలిగి తక్కువ ఆదాయములో కాలము గడపుట అనిన యెంత కష్టమో అనుభవించేవారికి తెలియును. ఆ కష్ట నివారణకే యీ జన్మ నిగ్రహ సాధనలు.

పురుషులకు—

పురుషులు ఉపయోగించు రబ్బరు సాధనము. యీ చక్కని జన్మనిగ్రహ సాధనమే గాక సుఖవ్యాధులు సోకనే సోకవు.

ఈ రబ్బరు సాధనము వెల 1-కి ఒక రూపాయి.

స్త్రీలకు—

ఇదియు రబ్బరు సాధనమే. పట్టుదారము గలిగి ఉపయోగించుటకు అనుకూలమైన సాధనము. పాశ్చాత్య దేశాలలో లక్షలకొలది యీ సాధనమును ఉపయోగించుచున్నారు. ధర 1-కి రు. 2—8—0

ఆర్యన్ బుక్ డిపో,

ట్రిప్లికేన్, మదరాసు.